క్లుప్తంగా...

పూజలకు రావాలని మంత్రి తలసానికి ఆహ్వానం



మంత్రికి ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

ఖైరతాబాద్: గణేష్ నవరాత్రి ఉత్సవాలకు హాజరుకావాలని కోరుతూ శనివారం ఖైరతాబాద్ గణేష్ ఉత్సవ సమితి సభ్యులు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను ఆహ్వానించారు. ప్రతి సంవత్సరం ఒక్కో అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చే ఖైరతాబాద్ మహాగణపతి ఈ సంవత్సరం శ్రీ దశవిద్యా మహాగణపతిగా భక్తులకు దర్శనమివ్వనున్నాడని మంత్రికి తెలిపారు. కమిటీ సభ్యులు సందీప్‌రాజ్, రాజ్‌కుమార్, సురేందర్, బాల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జేహెచ్‌పీఎస్ చైర్మన్‌గా శ్రవణ్‌కుమార్‌రావు



శుభాకాంక్షలు తెలుపుతున్న ప్రతినిధులు

ఫిలింనగర్: ప్రముఖ విద్యా సంస్థ జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ చైర్మన్ పదవికి ఎ.శ్రవణ్‌కుమార్ రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం పాఠశాలలో జరిగిన సమావేశంలో ఈ మేరకు శ్రవణ్‌కుమార్‌ను చైర్మన్‌గా ఎన్నుకున్నారు. జూబ్లీహిల్స్ ఎడ్యుకేషన్ సొసైటీ ప్రెసిడెంట్ కాసువంటి కృష్ణదేవరావు ఆధ్వర్యంలో ఈ సమావేశం జరిగింది. గత 36 సంవత్సరాలుగా జేహెచ్‌పీఎస్ విద్యారంగంలో ఉత్తమమైన సేవలు అందిస్తున్నది. ఈ పాఠశాల మొట్టమొదటి బ్యాచ్ విద్యార్థుల్లో ఒకరైన శ్రవణ్ కుమార్ అదే పాఠశాలకు చైర్మన్‌గా ఎన్నిక కావడం విశేషం. ఇది తనకెంతో గర్వకారణంగా ఉందని ఆయన తెలిపారు. స్కూల్ అభ్యున్నతికి పాటుపడుతూ ఈ విద్యాసంస్థ భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత శిఖరాలు అందుకుంటుందని ఆశిస్తున్నట్లు సెక్రటరీ టి.హరిశ్చంద్ర కుమార్ తెలిపారు.

'విమోచన'ను జయప్రదం చేయండి: బీజేపీ



ప్రచారం చేస్తున్న బీజేపీ నేతలు

వెంగళరావునగర్: హైదరాబాద్ విమోచన దినోత్సవాన్ని విజయవంతం చేయాలని పలువురు బీజేపీ నేతలు కోరారు. యూసుఫ్‌గూడ డివిజన్ వెంకటగిరిలో ఇంటింటికీ తిరుగుతూ శనివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా నేతలు మాట్లాడుతూ... ఈ నెల 17న హైదరాబాద్ లిబరేషన్ డేను పురస్కరించుకుని పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే సభకు కేంద్ర మంత్రి అమిత్‌షా హాజరు కానున్నారని, ప్రతి ఒక్కరూ తరలి రావాలని కోరారు. బీజేపీ జూబ్లీహిల్స్ నియోజకవర్గ నాయకులు జ్ఞానేశ్వర్, పులి రామ్, బడుగు సతీష్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిక్షణలో భాగస్వాములు కావాలి



మట్టి గణపతులను తయారు చేసిన బీవీబీపీ స్కూల్ విద్యార్థులు

బంజారాహిల్స్: పర్యావరణ పరిక్షణతో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ప్రకృతిని కాపాడుకుందామంటూ జూబ్లీహిల్స్ భారతీయ విద్యాభవన్ పబ్లిక్ స్కూల్ విద్యాశ్రమం 7వ తరగతి విద్యార్థులు శనివారం మట్టితో గణపతులను తయారు చేసి సమాజంలో తాము సైతం అంటూ నడిచారు. విద్యార్థులంతా ఉదయం నుంచే మట్టిని దేవుళ్లుగా మలిచి తమ బాధ్యతను నెరవేర్చారు. తయారు చేసిన మట్టి విగ్రహాలను టీచర్లు, ఇతర విద్యార్థులకు అందజేశారు. ప్రతి ఒక్కరూ మట్టి గణపతులను పూజిద్దామంటూ ప్రతిజ్ఞ చేశారు.

రేపు ఖైరతాబాద్ గణేషుడికి భారీ వస్త్రాలు

లక్డీకాపూల్: ఖైరతాబాద్ గణనాథుడికి పద్మశాలీ సంఘం ఆనవాయితీ ప్రకారం ఈ నెల 18న భారీ వస్త్రాలను సమర్పించనున్నట్లు ఆ సంఘం ఖైరతాబాద్ నియోజకవర్గం అధ్యక్షుడు కదారి శ్రీధర్ తెలిపారు. వినాయక చవితి రోజున ఉదయం భారీ ఊరేగింపుగా వచ్చి 75 అడుగుల చేనేత జంధ్యం, 75 అడుగుల చేనేత నూలు కండువా, 75 అడుగుల గరిక మాల, దేవతా మూర్తులందరికీ పట్టు వస్త్రాలు సమర్పించనున్నట్లు పేర్కొన్నారు. వీటిని చేనేత కార్మికులతో ప్రత్యేకంగా డిజైన్ చేయించి.. నిష్టతో నేయించామన్నారు. సోమవారం ఉదయం గుర్రు బగ్గీలో పట్టు వస్త్రాలను ఉంచి ఊరేగింపుగా వస్తామన్నారు. ఈ సందర్భంగా గణేషుడికి ముత్యాభిషేకం చేయనున్నామన్నారు.

18 నుంచి గణపతి దీక్ష



దీక్ష పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న హన్మంతరావు

ఖైరతాబాద్: వినాయక చవితి నుంచి నిమజ్జనం వరకు గణపతి దీక్షను పాటించాలని కోరుతూ శనివారం ఖైరతాబాద్ మహాగణపతి ప్రాంగణంలో గణపతి దీక్ష పోస్టర్‌ను ఆవిష్కరించారు. వినాయక చవితి పర్వదినం ఈ నెల 18వ తేదీ నుంచి నిమజ్జనం 28వ తేదీ వరకు ప్రతి ఒక్కరూ గణపతి దీక్ష పాటించవచ్చని, దవళ వర్ణ వస్త్రాలు, మద్యపానం, మత్తు పదార్థాలు, మాంసాహారం తీసుకోకుండా, సూర్యోదయం, సూర్యాస్తమయాల్లో గణపతి పూజ, దీక్ష సమయంలో ఉదయం శాకాహార భోజనం, సాయంత్రం అల్పాహారం తీసుకోవాలని గణపతి దీక్షా చైర్మన్ జి.హన్మంతరావు తెలిపారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో శిల్పి చిన్నస్వామి రాజేంద్రన్, గణపతి దీక్షా ఉపాధ్యక్షుడు సందీప్‌రాజ్, మహేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు కాంగ్రెస్ నేతలపై అట్రాసిటీ కేసు

బంజారాహిల్స్: అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ ఫ్లెక్సీలను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తొలగిస్తున్న సమయంలో తమపై దాడిచేసి కులంపేరుతో దూషించారనే ఫిర్యాదు మేరకు ముగ్గురు కాంగ్రెస్ నేతలపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి.విజయారెడ్డి, సికింద్రాబాద్ డీసీసీ అధ్యక్షుడు ఎం.అనిల్‌కుమార్ యాదవ్, ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ సి.రోహిణ్‌రెడ్డి తదితరులు 20 మంది కాంగ్రెస్ కార్యకర్తలతో కలిసి వచ్చి తమపై దాడి చేయడమే కాకుండా కులంపేరుతో దూషిస్తూ బెదిరింపులకు పాల్పడ్డారని వారిపై చర్యలు తీసుకోవాలంటూ జీహెచ్ఎంసీ ఈవీడీఎం డీఆర్ఎఫ్ అసిస్టెంట్ సాయికుమార్ బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో బంజారాహిల్స్ పోలీసులు ముగ్గురిపైనా ఐపీసీ సెక్షన్ 353, 332, 504, 506, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. వివరాలివీ... సీడబ్ల్యూసీ సమావేశం సందర్భంగా కాంగ్రెస్ నేతలు బంజారాహిల్స్ రోడ్ నెం. 1లోని తాజ్‌కృష్ణా హోటల్ ముందు భారీగా ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేశారు. అనుమతులు లేవంటూ డీఆర్ఎఫ్ సిబ్బంది రాత్రి వీటిని తొలగిస్తుండగా సమాచారం అందుకున్న విజయారెడ్డి, రోహిణ్‌రెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్‌తో పాటు మరికొందరు వీరిని అడ్డుకుని దుర్భాషలాడారు. కులం పేరుతో దూషించారంటూ తనపై దాడి కూడా చేశారంటూ బాధితుడు సాయికుమార్ ఫిర్యాదులో పేర్కొన్నారు. అధికారుల ఆదేశాల మేరకే తనతోటి సిబ్బంది రాంరెడ్డి, శివకుమార్, విజయ్‌కుమార్‌లతో కలిసి వీటిని తొలగిస్తున్నామని... రావడంతోనే తనపై కర్రలతో దాడి చేశారంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. తాను ఎస్సీనని చెప్పినా ఇష్టమొచ్చినట్లు తిట్టారంటూ ఆరోపించారు. మా కాంగ్రెస్ పార్టీ బ్యానర్లు తీస్తే అంతు చూస్తామంటూ బెదిరించారని అన్నారు. తనను బలవంతంగా అక్కడి నుంచి గల్లీలోకి ఈడ్చుకెళ్ళగా అక్కడి నుంచి తప్పించుకొని పారిపోయామని అన్నారు. తననే టార్గెట్‌గా చేసుకొని ఖైరతాబాద్ చౌరస్తా వరకు తీసుకెళ్లి అక్కడ కూడా కొట్టారని ఈ ముగ్గురిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలంటూ కోరారు.

బీజేపీ నాయకురాలు పద్మకు పరామర్శ

శ్రీనగర్‌కాలనీ: బీజేపీ ప్రజల పార్టీ అని, అధికార పార్టీ నుంచి ఎన్ని అవాంతరాలు వచ్చినా బీజేపీ నేతలు ప్రజల కోసం పోరాడతామని సెంట్రల్ జిల్లా పార్టీ అధ్యక్షుడు గౌతమ్‌రావు అన్నారు. శనివారం జూబ్లీహిల్స్ నియోజవర్గ బీజేపీ నాయకురాలు డాక్టర్ పద్మ వీరపనేని ఇటీవల జరిగిన ధర్నాలో గాయపడి హాస్పిటల్‌లో చికిత్స తీసుకున్నారు. ఆమెను శ్రీనగర్‌కాలనీలోని పార్టీ కార్యాలయంలో గౌతమ్‌రావు ఆమెను పరామర్శించి ఆరోగ్య విషయాలు అడిగి తెలుసుకున్నారు. నేతలు కుంబాలు గంగరాజు, హరీష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సాంకేతికంగా నిత్యం అప్‌డేట్ కావాల్సిందే...

సియేంట్ సంస్థ చైర్మన్ డాక్టర్ బీవీఆర్ మోహన్‌రెడ్డి



కార్యక్రమంలో పాల్గొన్న పద్మశ్రీ డాక్టర్ బీవీఆర్ మోహన్‌రెడ్డి

బంజారాహిల్స్: విద్యార్థులు ప్రతి రోజూ టెక్నాలజీ విషయంలో అప్‌డేట్ కావాలని, ఏదో మొక్కుబడి చదువులు కాకుండా ఒక విషయాన్ని నేర్చుకోవడంతో పాటు ప్రాక్టికల్‌గా తెలుసుకోవాలని సియేంట్ సంస్థ ఫౌండర్, చైర్మన్ పద్మశ్రీ డాక్టర్ బీవీఆర్ మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం బంజారాహిల్స్ సుల్తాన్ ఉల్ ఉలూం ఎడ్యుకేషనల్ సొసైటీలో ముఫకంజా ఇంజినీరింగ్ కాలేజీ విద్యా సంవత్సరం ప్రారంభోత్సవ వేడుకల్లోల ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నిత్యం ఏ రంగాన్ని తీసుకున్నా టెక్నాలజీ విషయంలో చాలా ముందుంటున్నారని ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌తో అద్భుతాలు సృష్టిస్తున్నారని అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఎవరైతే వినూత్నంగా ఆలోచిస్తారో వారికి మంచి అవకాశాలుంటాయన్నారు. మనిషి ఆలోచించే లోపే ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ఆచరణలో పెట్టేస్తున్న రోజులివి అని ఆయన అన్నారు. బయట వివిధ రంగాల్లో వస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు విద్యార్థులు గమనిస్తూ ఉండాలని అన్నారు. చదువుతున్న సబ్జెక్టులో మార్కులు మాత్రమే కాదని ఆ విషయంపై మనకు ఎంత అవగాహన ఉంది అనే విషయమే ముఖ్యమని అన్నారు. సుల్తాన్ ఉల్ ఉలూం ఫౌండేషన్ చైర్మన్ మహ్మద్ వలియుల్లా, గౌరవ కార్యదర్శి జాఫర్ జావెద్, ఆమెర్ జావెద్, బోర్డు మెంబర్లు జస్టిస్ ఇబ్రహం అలీ సిద్ధఖి, ప్రొఫెసర్ సయ్యద్ ఫర్హతుల్లా హుస్సేని, రిజిస్ట్రార్ నర్సింహారావు తదదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ వాడొద్దన్నందుకు బాలిక ఆత్మహత్య



ఇషికా (ఫైల్)

బంజారాహిల్స్: సెల్‌ఫోన్ ఎక్కువగా వాడుతున్నావని, ఇది మంచిది కాదని తల్లిదండ్రులు మందలించగా మనస్థాపానికి గురైై కూతురు ఆత్మహత్య చేసుకున్న ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాలివీ... వెస్ట్‌బెంగాల్‌కు చెందిన సంజీబ్ మండల్ ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తూ బంజారాహిల్స్ రోడ్ నెం. 10లోని నూర్‌నగర్‌లో కుటుంబంతో కలిసి అద్దెకుంటున్నాడు. ఆయన కూతురు ఇషికా మండల్(13) స్థానిక ప్రైవేట్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నది. ఎప్పటిలాగే శుక్రవారం సాయంత్రం స్కూల్ నుంచి వచ్చిన ఆమె బెడ్‌రూమ్‌లోకి వెళ్లి సెల్‌ఫోన్‌ను అదే పనిగా చూస్తున్నది. పలుమార్లు మందలించినా ఇషికా ఫోన్‌చూడటం మాత్రం మానడం లేదు. తల్లిదండ్రులు ఈ విషయంలో కూతురిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పది నిమిషాల తర్వాత తన గదిలోకి వెళ్లిన ఇషికా ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సీడబ్ల్యూసీ మెంబర్ దీప్తిఘోష్‌ను కలిసిన కాంగ్రెస్ నేతలు



దీప్తిఘోష్‌ను కలిసిన సురేందర్ యాదవ్ తదితరులు

వెంగళరావునగర్: సీడబ్ల్యూసీ మెంబర్ దీప్తి ఘోష్‌ను జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి చెందిన పలువురు సీనియర్ కాంగ్రెస్ నేతలు, ఆయా డివిజన్ల అధ్యక్షులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఈ నెల 17న తుక్కుగూడలో జరగనున్న కాంగ్రెస్ విజయభేరి సభను విజయవంతం చేయడానికి ప్రతి నియోజకవర్గం నుంచి కనీసం రెండు వేల మందికి తక్కువ లేకుండా కార్యకర్తలు తరలి రావాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ వెంగళరావునగర్ డివిజన్ అధ్యక్షుడు సురేందర్‌యాదవ్ తదితరులు ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

నాగర్‌కర్నూల్ సభకు తరలిన బీఆర్ఎస్ శ్రేణులు



చలో నాగర్‌కర్నూల్‌కు భారీ ర్యాలీగా వెళ్తున్న నాగేందర్ తదితరులు

బంజారాహిల్స్: పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ప్రారంభోత్సవానికి శనివారం మధ్యాహ్నం ప్రగతి భవన్ నుంచి ముఖ్యమంత్రి కేసీఆర్‌తో కలిసి ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ బయల్దేరారు. అంతకుముందు ఫిలింనగర్ నుంచి భారీ ర్యాలీగా కార్యకర్తలు తరలి వెళ్ళగా ఈ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈ పథకం తెలంగాణ ప్రజలకు ఒక వరంలాంటిదన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ అపర భగీరథుడిగా మరోసారి తన కీర్తిని చాటుకున్నారని అన్నారు. ముఖ్యమంత్రితో కలిసి కార్యక్రమంలో తాను కూడా పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.

త్వరలో దుష్టపాలన అంతం: విజయారెడ్డి



ద్వారకాపూరి కాలనీలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ విజయారెడ్డి

పంజగుట్ట: రాబోయేది కాంగ్రెస్ పాలనే అని ప్రస్తుతం ఉన్న దుష్టపాలన నుంచి ప్రజలకు విముక్తి అతిత్వరలోనే లభిస్తుందని టీ పీసీసీ ప్రధాన కార్యదర్శి, ఖైరతాబాద్ కార్పొరేటర్ పి.విజయారెడ్డి పేర్కొన్నారు. హాత్‌సే హాత్ జోడో కార్యక్రమంలో భాగంగా విజయారెడ్డి శనివారం పంజగుట్ట ద్వారకాపూరి కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె ప్రతి ఇంటికీ తిరుగుతూ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వివాదాస్పదంగా మహిళా ఎస్ఐ ప్రీ వెడ్డింగ్ షూట్!



పంజగుట్ట: పంజగుట్ట పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహించే ఓ మహిళా ఎస్ఐ ప్రీ వెడ్డింగ్ షూట్ వివాదాస్పదంగా మారింది. మహిళా ఎస్ఐ వివాహం ఆగస్టు 26న ఉండటంతో ప్రీ వెండ్డింగ్ షూట్‌కు ప్లాన్ చేసింది. అయితే అది ఏకంగా పోలీస్ వ్యాన్ లోంచి పంజగుట్ట పోలీస్ స్టేషన్‌లో దిగడం, యూనిఫాంలో ఉండటం కాస్తా వివాదాస్పదం అయ్యింది. ఈ విషయంలో ఆమె అధికార దుర్వినియోగానికి పాల్పడినట్లు పోలీస్ ఉన్నతాధికారులు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఈ వీడియో ఆలస్యంగా బయటకు రావడంతో శనివారం అన్ని సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యింది.

న్యాయవాది ఇంట్లో సెల్‌ఫోన్ చోరీ

పోలీసుల అదుపులో నిందితులు?

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని వేమిరెడ్డి ఎన్‌క్లేవ్‌లో నివసించే అడ్వకేట్ గున్నా రఘుచంద్ర నివాసంలో దొంగలు పడి ఫోన్‌తో పాటు ఇయర్‌పోడ్స్ దొంగిలించిన ఘటన బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... శుక్రవారం తెల్లవారుజామున ఆ నివాసంలోకి ఇద్దరు ఆగంతకులు గోడదూకి ప్రవేశించి బెడ్‌రూమ్‌లో ఉన్న ఫోన్‌తో పాటు ఇయర్‌పోడ్స్ దొంగిలించి పరారయ్యారు. అంతకుముందే పక్కనే ఉన్న మరో ఇంట్లో దొంగతనానికి వెళ్లగా కుక్కలు అరవడంతో అక్కడి నుంచి పారిపోయి రఘుచంద్ర నివాసంలోకి దూకినట్లుగా పోలీసు దర్యాప్తులో తేలింది. నిందితులు ఇద్దరినీ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

మరణించిన భర్త బ్యాంకు ఖాతాలోని నగదు డ్రాపై ఫిర్యాదు

బంజారాహిల్స్: తన భర్త చనిపోయిన తర్వాత ఆయన పేరుతో బ్యాంకు నుంచి రూ. 10 లక్షలు డ్రా చేశారని వారిపై చర్యలు తీసుకోవాలంటూ బాధితురాలు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. వివరాలివీ... బంజారాహిల్స్ రోడ్ నెం. 10లోని సింగాడబస్తీలో నివసించే అవనాదుల రాజమౌళి(72)ఈ నెల 4వ తేదీన కన్నుమూశారు. ఆయన మరణించిన తర్వాత బ్యాంకు నుంచి పలుమార్లు రూ. 10 లక్షల వరకు డ్రా చేయడం జరిగిందన్నారు. బ్యాంకు పాస్‌బుక్, చెక్‌బుక్, ఏటీఎం కార్డు సెల్‌ఫోన్ వీటన్నింటికి నిర్వాహకుడిగా ఉన్న తన భర్త వ్యక్తిగత సహాయకుడు సంజయ్ మీద తమకు అనుమానం ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ నెల 4 నుంచి 14వ తేదీ మధ్యలో నగదు డ్రా వివిధ కోణాల్లో జరిగిందని వివరించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రశాంత వాతావరణంలో పండగలు నిర్వహించుకోవాలి

బంజారాహిల్స్: గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులతో బంజారాహిల్స్ పోలీసులు శనివారం బంజారాహిల్స్ రోడ్ నెం.11లోని లేక్‌వ్యూ బంజారా ఫంక్షన్ హాల్‌లో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. బంజారాహిల్స్ ఏసీపీ సుబ్బయ్య, ఇన్‌స్పెక్టర్ నరేందర్‌తో పాటు ఎస్ఐలు కరుణాకర్‌రెడ్డి, ప్రీతిరెడ్డి, రవీందర్ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు. ప్రశాంత వాతావరణంలో పండగలు నిర్వహించుకోవాలని పోలీసులకు సంపూర్ణ సహకారం అందించాలని వారు కోరారు. పోలీసు సూచనలను తప్పనిసరిగా పాటించాలన్నారు.